# తనదాకా వస్తే!

- కొడుకుల సూర్యసుబ్రహ్మణ్యం

ఇలా చదువు పూర్తయిందో లేదో అలా ఉద్యోగం వచ్చేసింది తన అదృష్టం కొద్దీ శ్రీనివాస్‌కి. స్వగ్రామం అనకాపల్లి దగ్గర కశింకోట. ఉద్యోగం వైజాగ్‌లో. చేసేది లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌లో.

రోజూ వెళ్ళి రావాలంటే కష్టమౌతుందని వైజాగ్‌లోనే రూమ్ తీసుకొని బాచిలర్ జీవితానికి అలవాటు పడిపోయాడు. ఉద్యోగంలో స్థిరపడ్డాక గృహస్థ జీవనానికి కావలసిన పరికరాలన్నీ అమర్చుకున్నాకనే పెళ్ళి చేసుకోవాలని గట్టి నిర్ణయానికి వచ్చేసాడు. ఈ విషయంలో పేరెంట్స్ కూడా అడ్డుచెప్పలేదు.

"గాజులచేతివంటకు నోచుకోవాలంటే ఇంకా సుమారు ఐదారు సంవత్సరాలైనా పడుతుంది. అందాకా నాకీ తిప్పలు తప్పవా? ఏమిటీ శరణ్యం?" అనుకుంటూ తనలో తానే ఎంతగానో మధనపడిపోతుండేవాడు.

ఒకరోజు మంచి ఐడియా ఒకటి అతనిలో తళుక్కున మెరిసింది. ఆ ఆలోచనని ఆచరణలో పెడితే ఎలా ఉంటుందో చూద్దాం అనుకొని తగిన సమయంకోసం ఎదురుచూడసాగాడు.

మాఘమాసం వచ్చేసింది. అది పూర్తిగా పెళ్ళిళ్ళ సీజన్ కావడంతో శ్రీనివాస్‌కి పట్టరాని ఆనందం కలిగింది. కారణం అప్పుడెప్పుడో తనకొచ్చిన ఆలోచనకు ఊపిరి పోసే సమయం ఆసన్నం కావడమే!

★ ★ ★

"హలో శ్రీనివాస్! హవ్వార్యూ?" "మన శ్రీనివాస్ కూడా రానే వచ్చాడు" "ఏరా.. నువ్వెక్కడివే వచ్చావ్! మన ఫ్రెండ్స్ ఎవరూ రాలేదా?"

ఇలా తను అటెండ్ అయిన ప్రతి ఫంక్షన్‌లో తనకు పరిచయమున్న వాళ్ళెవరో ఒకళ్ళు తటస్థపడడం, పలకరించడం లాంటివి పరిపాటయిపోయింది.

ఇక ఆడపెళ్ళివారు శ్రీనివాస్‌ని మగపెళ్ళివారి తాలూకనుకునేవారు. మగపెళ్ళివారు ఆడపెళ్ళివారి తాలూకనుకునేవారు. అలా ఖచ్చితంగా అనుకుంటారనీ శ్రీనివాస్‌కి తెలుసు.

ఇలా ప్రతి సంవత్సరం మాఘఫాల్గుణ మాసాలు టన్చన్‌గా మ్యారేజ్ ఫంక్షన్లకు అటెండైపోయేవాడు శ్రీనివాస్.

★ ★ ★

తన సిస్టర్ మ్యారేజ్‌కి ఎందరు అటెండ్ అవుతారన్నది శ్రీనివాస్ ముందుగానే ఎస్టిమేషన్ వేసుకున్నాడు. అంచనా ప్రకారం పురమాయింపులు, ఏర్పాట్లు అన్నీ పూర్తయిపోయాయి. పెళ్ళి గ్రాండ్‌గా జరిగింది.

అయితే... భోజనాల విషయంలో గందరగోళం తప్పలేదు. తను ఎస్టిమేషన్‌కు మించే వంటలు వండించాడు.

కానీ కావలసినవాళ్లు కనీసం వందమందయినా తిండీ తిప్పలూ లేకుండా తన ముందునుంచే విసుక్కుంటూ వెళ్ళిపోవడం చూసి తట్టుకోలేకపోయాడు శ్రీనివాస్.

"పెళ్ళెంత గ్రాండ్‌గా చేస్తేనేంటి? ఇంతన్నం పెట్టలేనప్పుడు!" అనే మాటలు అతని చెవినపడ్డాయి.

"అంటే పిలవని వాళ్లు కూడా తిండికెగబడడానికి వచ్చేసారన్న మాట" ఒళ్ళు మండిపోయింది శ్రీనివాస్‌కి.

అంతే.. ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్ళిపోయాడు.

"ఛీ.. ఛీ... నేను కూడా ఒకప్పుడింతేగా! పిలవకున్నా, పరిచయం లేకున్నా కూడా ప్రతి ఫంక్షన్‌కీ ఎగబడి పీకలదాకా మెక్కేసొచ్చేవాడిని. అవతలివాళ్ళు ఎంత ఇబ్బంది పడుంటారో కదా!" అనుకుంటూ తనలో తానే ఎంతగానో



పశ్చాత్తాపం పడిపోయాడు శ్రీనివాస్. తీరా తనదాకా వస్తేగాని అతగాడు కళ్ళు తెరవలేకపోయాడు.

★